

రాజన్నకు సెలవుల రద్దీ

వేములవాడ: రాజన్నను ఆదివారం 15వేల మంది భక్తులు దర్శించుకున్నారు. కోడెమొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ద్వారా రూ.18 లక్షల ఆదాయం సమకూరింది.



మిడ్‌మానేరులో 27 టీఎంసీలు

బోయినపల్లి: మిడ్‌మానేరులో నీటిమట్టం 27.094 టీఎంసీలకు చేరింది. ఎస్సారెస్పీ నుంచి 7,600, మానేరు, మూల వాగుల్లోంచి 600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరుతోంది.

గరిష్టం/కనిష్టం
30.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కల్యాణోత్సవానికి హాజరుకండి

- ఎమ్మెల్యే కేటీఆర్‌కు ఆహ్వానం



కేటీఆర్‌కు ఆహ్వానపత్రికను అందజేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీశివ కేశవస్వామి ఆలయంలో జరిగే కల్యాణోత్సవానికి హాజరుకావాలని ఆలయ కమిటీ సభ్యులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌ను కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో ఆదివారం కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈనెల 22 నుంచి 24 వరకు ఆంజనేయస్వామి, నవగ్రహాలు, విష్ణుపాదాల ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చివరి రోజు శివకేశవ, రాజరాజేశ్వరస్వామి–పార్వతీదేవీ కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు. 24న జరిగే కల్యాణానికి రావాలని కేటీఆర్‌ను ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వరుస కృష్ణహరి, గ్రామ మాజీ సర్పంచ్ రామ భీమేశ్వర్, నాయకులు వంగల వసంత్‌కుమార్, ఉచ్చిడి కిషన్‌రెడ్డి, నారాయణరెడ్డి, చింతల ధర్మయ్య ఉన్నారు.

చిరుజల్లులు



వేములవాడ రాజన్న గుడి వద్ద కురుస్తున్న వర్షం

సిరిసిల్ల/వేములవాడ: జిల్లాలోని ఆరు మండలాల్లో ఆదివారం చిరుజల్లులు కురిశాయి. రుద్రంగిలో అత్యధికంగా 15.5 మిల్లీమీటర్ల వర్షం పడగా.. బోయినపల్లిలో 3.2, వేములవాడరూరల్‌లో 0.8, సిరిసిల్లలో 0.8, వీర్నపల్లిలో 0.3, ఇల్లంతకుంటలో 0.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చందుర్తి, వేములవాడ, కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో వర్షం పడలేదు. వేములవాడలో హఠాత్తుగా భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోతతో ఇబ్బందులు పడిన జనాలకు సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ఉపశమనాన్నిచ్చింది. వర్షంతో రాజన్న దర్శనానికి వచ్చిన భక్తులు తడిసి ముద్దయ్యారు.

కరాటేలో గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్ సాధించిన సుశాంత్

ఇల్లంతకుంట: కరీంనగర్‌లో ఆదివారం జరిగిన సౌతిండియా కరాటే చాంపియన్‌షిప్–2025లో ఏనుగుల సుశాంత్ గోల్డ్‌మెడల్ సాధించారు. చెలిమిల రక్షిత, చొప్పరి విఘ్నేశ్వర్, ప్రహల్య, సిల్వర్ మెడల్స్ సాధించారు.

వేతన వెతలు



విధుల్లో పంచాయతీ కార్మికులు

- పారిశుధ్య కార్మికులకు పండుగకు వస్తులేనా
- రెండు నెలలుగా అందని వేతనాలు
- జిల్లాలో 1,550 మంది కార్మికులు

ముస్తాబాద్(సిరిసిల్ల): చాలీచాలని వేతనాలతో కాలం వెల్లదీస్తున్న పారిశుధ్య కార్మికులకు రెండు నెలలుగా ఎదురుచూపులు తప్పడం లేదు. గ్రామాలు స్వచ్ఛంగా ఉంచే బాధ్యతను తమపై వేసుకుని పనిచేసే పారిశుధ్య కార్మికుల బతుకులు దుర్భరంగా మారుతున్నాయి. తక్కువ జీతం సైతం సకాలంలో రాక కుటుంబ పోషణకు అప్పులు చేస్తున్నారు. బతుకమ్మ, దసరా పండుగ సమీపిస్తుండడంతో నూతన వస్త్రాలు, ఇతర సామగ్రి కొనుగోలు చేద్దామంటే చేతిలో డబ్బులు లేక దిక్కులు చూస్తున్నారు. జిల్లాలోని 255 గ్రామపంచాయతీల్లో 1,550 మంది మల్టీపర్పస్ వర్కర్లు పనిచేస్తున్నారు. మల్టీపర్పస్ వర్కర్లు రెండు నెలల వేతనాల కోసం పడిగాపులు పడుతున్నారు.

చెల్లింపు విధానం మారినా..

పంచాయతీ కార్మికులకు మూడు నెలల క్రితం వేతనాలు చెల్లించే విధానాన్ని ప్రభుత్వం మార్చింది. గతంలో పంచాయతీ కార్యదర్శులు ఎస్‌టీవోలకు వేతనాల కోసం చెక్కులు పంపేవారు. దీని ద్వారా జీతాల చెల్లింపు ఆలస్యమవుతుందని కార్మికులు ఆందోళన చేశారు. ఒక్కోసారి ప్రభుత్వం ఎస్‌టీవో చెల్లింపులపై ఫ్రీజింగ్ పెడుతుండడంతో వేతనాల చెల్లింపులు నిలిచిపోయేవి. జూన్‌లో పారిశుధ్య కార్మికుల వేతనాల కోసం టీఎస్ బీపాస్ అకౌంట్ ప్రారంభించింది. దీని ద్వారా కార్మికుల వేతనాలు పంచాయతీ ఖాతాలో జమవుతున్నాయి. కార్యదర్శి, స్పెషల్ ఆఫీసర్‌లు చెక్కు రాసి డబ్బులు తీసుకుని కార్మికులకు పంపిణీ చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్‌లో కార్మికులు పనిచేసిన దినాలను నమోదు చేసేవారు. దీని ద్వారా బీపాస్ ద్వారా జీతాలను ఏప్రిల్, మే, జూన్ నెలల్లో విడుదల చేశారు. అయితే జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన వేతనాలు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం సెప్టెంబర్ సగం వరకు పూర్తయింది. అక్టోబర్‌లో బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలు వస్తుండడంతో త్వరగా వేతనాలు విడుదల చేయాలని కార్మిక నాయకులు కోరుతున్నారు. పండుగలకు బట్టలు, కిరాణ సామగ్రి కోసం ఇబ్బంది పడుతున్నామని కార్మికులు వాపోతున్నారు. వేతనాలు చెల్లించకపోతే సమ్మెకు వెళ్తామని హెచ్చరిస్తున్నారు.

కార్మికుల డిమాండ్లు ఇవీ..

- పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలి.
- ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు పెంచాలి. కనీసం రూ.26వేలు ఇవ్వాలి.
- హెల్త్‌కార్డులు, అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి.
- కార్మికులు చనిపోతే వారి కుటుంబానికి రూ.10లక్షలు పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.
- గ్రీన్‌చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలి.
- అర్హులకు పదోన్నతులు కల్పించి కార్యదర్శులుగా నియమించాలి.

జీతం ఇచ్చి ఆదుకోవాలి



జీతం రాక ఇబ్బంది అవుతుంది. పండుగలు దగ్గర పడుతున్నయి. సార్లు మా గురించి ఆలోచించాలి. మబ్బుల వచ్చి రోడ్లు ఊడుస్తున్నం. మోర్లు తీస్తున్నం. ప్రతీ నెల జీతం ఇచ్చేటట్లు చేయాలి. పానం బాగలేకపోతే పెద్ద దవాఖాన్లలో ఫ్రీగా చూపెట్టాలి.

– బాలరాజవ్వ, కార్మికురాలు, నామాపూర్

కార్మికులకు అండగా నిలవాలి



ఎంతో కష్టపడి పనిచేసే కార్మికులకు ప్రభుత్వం అండగా నిలవాలి. అనారోగ్యానికి గురవుతున్న పనిచేస్తున్నాం. చెత్తను తీయడం, మోర్లు సాపు చేయడం ఇప్పటితరం చేయలేదు. కుటుంబాలను పోషించుకునేందుకే పారిశుధ్య పనులు చేస్తున్నాం. ప్రభుత్వం ఆలోచించి రెగ్యులర్ చేసి వేతనాలు పెంచి ఆదుకోవాలి.

– శ్రీనివాస్, సీఐటీయూ మండలాధ్యక్షుడు

కొత్త విధానంలోనైనా జీతాలు ఇవ్వాలి



గతంలో మాకు ఎస్‌టీవోతో జీతాలు ఇచ్చేవారు. ఇప్పుడు కొత్త విధానంతో వేతనాలు ఇవ్వడం మొదలుపెట్టారు. దీని ద్వారానైనా ప్రతీ నెల జీతాలు ఇస్తే బాగుండు. కార్మికుల జీవితాలు చిన్నవి. జీతాలు వస్తేనే మా కుటుంబాలను పోషించుకుంటాం. గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి.

– బాబు, పంపు ఆపరేటర్, ముస్తాబాద్

మహిళల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం



ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన మహిళలు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలో తన నివాసంలో ఆదివారం పలువురు మహిళలు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నారన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలో ఇందిరా మహిళాశక్తి పథకాన్ని ప్రారంభించారన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేసి, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని సంకల్పించినట్లు పేర్కొన్నారు. ఆనాడు ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు మేలు జరిగితే మళ్లీ రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వంలో మహిళలకు పెట్టపీట వేస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్, ఆర్టీసీ సంస్థకు అద్దెబస్సులు, పెట్రోల్ పంపు, ధాన్యం కొనుగోలు, రైస్‌మిల్ వంటి అనేక వ్యాపారాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఇందిరా మహిళాశక్తిలో భాగంగా మహిళలు ఆర్థికంగా ఎదగాలని మైక్రో ఎంటర్‌ప్రైజెస్, మహిళా శక్తి స్టిచ్చింగ్ సెంటర్స్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ యూనిట్, సోలార్ పవర్‌ప్లాంట్, డెయిరీ యూనిట్లు ఏర్పాటు చేసి, బ్యాంక్ లింకేజీ రుణాలు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోన్ బీమా, ప్రమాదబీమా పథకాలతో ఎందరికో ప్రయోజనం చేకూరుతుందన్నారు.

నేడు జిల్లా కబడ్డీ సెలెక్షన్స్

సిరిసిల్లఅర్బన్: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9 గంటలకు సబ్ జూనియర్ బాల, బాలికల జిల్లా జట్టుకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ఆది శ్రీనివాస్, అధ్యక్షుడు ముసుకు మల్లారెడ్డి తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 31.09.2009 తర్వాత జన్మించిన, 55 కిలోల లోపు బరువు ఉండాలని పేర్కొన్నారు. ఒరిజినల్ ఆధార్‌కార్డు, ఎస్సెస్సీ మెమోతో హాజరుకావాలని కోరారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25 నుంచి నిజామాబాద్ జిల్లా ముప్కాల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

గంభీరావుపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫస్టియర్‌లో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం దోస్త్ ద్వారా స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయలక్ష్మి తెలిపారు. ఈనెల 15, 16 తేదీల్లో విద్యార్థులు తమ అప్లికేషన్లను కళాశాలలో సమర్పించాలన్నారు.

బాబోయ్ కుక్కలు

- వీధి దాటాలంటే వణుకుతున్న జనం
- వెంటాడి దాడి చేస్తున్న కుక్కలు
- భయాందోళనలో ప్రజలు



వీరేదో కాపలా కోసం కర్రలు పట్టుకొని వెళ్తున్నారనుకుంటే పొరబాటు పడ్డట్టే. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో కుక్కల దాడులు పెరిగిపోవడంతో భయాందోళనతో కర్రలు పట్టుకొని ఇలా వాకింగ్‌కు వెళ్తున్నారు. ఎక్కడి నుంచి వస్తున్నాయో తెలియకుండానే దాడి చేస్తున్నాయి. వీరిని చూస్తే కుక్కల వీరంగం ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది.



ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఇంటికి కాపలా కుక్క అనేది పాత మాట. కుక్కను చూస్తే భయమేస్తుంది అనేది ఇప్పటి సత్యం. గుంపులుగా తిరుగుతున్న కుక్కలతో పల్లెప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. చేతిలో ఏదైనా తినే వస్తువు ఉంటే చాలు మీద పడి లాక్కెళ్తున్నాయి. ఇటీవల జిల్లాలో ఏ పల్లెకు వెళ్లినా కుక్కలు దాడి చేసిన బాధితులే కనిపిస్తున్నారు. కుక్కలను చూస్తే జిల్లా ప్రజలు భయాందోళన చేస్తున్నారు.

గుంపులుగా సంచారం

జిల్లాలో ఏ పల్లెకు పోయినా వీధుల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. వీధి దాటి రావాలంటే ప్రజలు భయపడుతున్నారు. విద్యార్థుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఊరిలోని బడికి వెళ్లాలంటే కుక్కలు వెంటపడుతాయోనని భయం..భయంగా వెళ్తున్నారు. ఊళ్లలో తిరిగి చిన్న..చిన్న వ్యాపారాలు చేసుకునే వారి పరిస్థితి దయనీయంగా ఉంది. కొత్త వారిని చూస్తే కుక్కల మంద మీద పడి కరిచేస్తున్నాయి.

ఊరూరా బాధితులే..

- ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌కు చెందిన లింగమ్మగారి భాస్కర్ బట్టలు ఇస్త్రీ చేసుకుని జీవిస్తున్నాడు. ఇటీవల ఓ గ్రామస్తుడి బట్టలు ఇస్త్రీ చేసి ఇంటి వద్దకు తీసుకెళ్తుండగా కుక్క దాడి చేసి గాయపరిచింది. వెంటనే సిరిసిల్లలోని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు.
- వేములవాడ పట్టణంలో ఇటీవల ఓ చిన్నారి ఇంటి బయట ఆడుతుండగా కుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది.
- ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన నర్సవ్వపై దాడి చేశాయి.
- ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌కు చెందిన నీరటి విష్ణుప్రసాద్ విధులకు వెళ్తుండగా కుక్కలు దాడి చేయడంతో బైక్‌పై నుంచి కిందపడ్డాడు. అయినా వదిలేయకుండా మళ్లీ దాడి చేశాయి.

కట్టెలు పట్టుకొని వెళ్తున్నాం



మేము మిత్రులం ఐదారుగురం కలిసి రోజూ ఉదయం, రాత్రి వాకింగ్‌కు వెళ్తుంటాం. ఇటీవల కుక్కలు రోడ్లపై గుంపులుగా తిరుగుతున్నాయి. చాలా మందిపై దాడి చేశాయి. కుక్కల భయంతోనే వాకింగ్‌కు వెళ్లాలంటేనే భయంగా ఉంది. చేతిలో కట్టెలు లేనిదే బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలి.

– బుస్స గంగాధర్, వ్యాపారి, ఎల్లారెడ్డిపేట

వెంటపడి కరిచింది



నేను ఊరిలో బట్టలు ఇస్త్రీ చేసి బతుకుతున్నాను. రోజులాగే ఇస్త్రీ చేసేందుకు డబ్బా వద్దకు వెళ్తుండగా కుక్క వెంటపడి కరిచింది. కుక్కలను నివారించాలని గ్రామపంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. గతంలో అనేకమందిపై కుక్కలు దాడి చేశాయి. ఇప్పటికైనా కుక్కల బాధను తొలగించాలి.

– లింగమ్మగారి భాస్కర్, రాచర్లబొప్పాపూర్

నమ్మితే.. నట్టేట మునుగుడే

వేములవాడలోని ఓ ప్రైవేట్ స్కూల్ అకౌంటెంట్‌కు సైబర్ మోసగాడి నుంచి మెసేజ్ వచ్చింది. మీ స్కూల్‌లో తన కుమారుడు చదువుతున్నాడని ఫీజు డబ్బులు పంపిస్తున్నట్లుగా పేర్కొన్నాడు. తాను మహారాష్ట్రలో ఉన్నానంటూ చెప్పి, ఒక్క రూపాయి పంపినట్లు సాధారణ మెసేజ్ పంపాడు. తర్వాత మరో రూ.5వేలు పంపుతున్నట్లు చెప్పి.. రూ.5వేలకు బదులుగా రూ.50వేలు వచ్చాయని, మిగతా రూ.45వేలు తనకు తిరిగి పంపించాలని ఓ క్యూఆర్ కోడ్‌ను సెండ్ చేశాడు. అకౌంటెంట్ ఈ విషయాన్ని స్కూల్ కరస్పాండెంట్ దృష్టికి తీసుకెళ్లగా.. తన ఖాతాలోని లావాదేవీలు పరిశీలించి, డబ్బులు రాలేవని సదరు వ్యక్తికి తెలిపారు. డబ్బులు పంపినట్లుగా స్క్రీన్ షాట్ పంపాలని కోరగా.. ఫొటోషాప్‌లో క్రియేట్ చేసిన ఇమేజ్‌ను పంపించి డబ్బుల వసూలుకు ప్రయత్నించాడు. దీన్ని పోలీసులకు పంపుతామని బెదిరించగానే ఫోన్ కట్ చేశాడు.

- రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- ఖాళీ అవుతున్న ఖాతాలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు
- 1930లో ఫిర్యాదు చేయాలని సూచన

సిరిసిల్లక్రైం: సైబర్ నేరగాళ్లు.. కంటికి కనిపించకుండానే నిలువుదోపిడీ చేస్తున్నారు. నమ్మితే చాలు నట్టేట ముంచుతున్నారు. లక్షల రూపాయలను కాజేస్తున్నారు. మోసం ఏ రూపంలో ఉంటుందో తెలియక ప్రజలు మోసపోతూనే ఉన్నారు. బాధితులు ఎవరికీ చెప్పుకోలేక సతమతమవుతున్నారు. సైబర్ నేరాల నియంత్రణకు పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా మోసాలకు అడ్డుకట్ట పడడం లేదు. ప్రజల అత్యాశనే వారిని నిలువుదోపిడీకి గురిచేస్తుంది. సైబర్ నేరం జరిగితే వెంటనే 1930లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు.

అత్యాశనే ఆసరా..

ఆర్థికంగా ఎదుగుదామని పలువురు సోషల్‌మీడియాలో వివిధ మార్గాల కోసం అన్వేషిస్తున్నారు. ఈక్రమంలో ఆన్‌లైన్‌లో కాచుకొని ఉన్న సైబర్ నేరగాళ్లు ఇలాంటి వారిని టార్గెట్ చేస్తున్నారు. వర్క్ ఫ్రం హోం, రోజుకో గంట.. వేలాది రూపాయల సంపాదన.. అంటూ ప్రకటనలు ఇస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. వీటిని నమ్మితే ప్రాసెసింగ్ ఫీజుగా కొంతమొత్తం డబ్బు పంపించాలంటూ నమ్మించి.. డబ్బు పంపగానే ఆన్‌లైన్‌లో నుంచి మాయమవుతున్నారు.


తక్కువ రేటుతో ప్రలోభాలు

ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తే తక్కువ ధరకు వస్తాయని పలువురు ఆసక్తి చూపుతున్నారు. కొన్ని బ్రాండెడ్ కంపెనీల పేరుతో నాసిరకం వస్తువులను ఫేక్ వెబ్‌సైట్‌లో పెట్టి సైబర్‌మోసాలకు పాల్పడుతున్నారు. డబ్బులు పంపించగానే వెబ్‌సైట్స్ మాయమవుతున్నాయి.

సైబర్ సమస్యల పరిష్కారానికి..

సైబర్ నేరం జరిగిన మొదటి గంటలోనే ఫిర్యాదు చేస్తే ఆర్థిక లావాదేవీలు జరుగకుండా చూడగలమని పోలీసులు చెబుతున్నారు. 1930లో పూర్తి వివరాలతో ఫిర్యాదు చేస్తే సైబర్ నేరగాడి ఎత్తుగడలను మొదట్లోనే అడ్డుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. నేషనల్ సైబర్‌క్రైం రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్సీఆర్పీ)లో ఫిర్యాదు నమోదు చేసి, వెంటనే సమీప ఠాణాలో ఫిర్యాదు చేయాలని పోలీస్ అధికారులు సూచిస్తున్నారు.

త్వరగా ఫిర్యాదు చేయండి



సైబర్ నేరం జరిగిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. అప్పుడే సైబర్ నేరస్తుల ఖాతాలోకి డబ్బులు వెళ్లకుండా అడ్డుకోగలం. సైబర్ నేరాలపై అవగాహన అవసరం. జిల్లాలోని ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో సైబర్ వారియర్స్‌ను ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యం చేస్తున్నాం. తక్షణ సహాయం కోసం 1930 టోల్ ఫ్రీ నంబర్, ఎన్సీఆర్పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి.

– మహేశ్ బీ గీతే, ఎస్పీ

సైబర్ నేరాల వివరాలు

వివరాలు	2023	2024	2025
ఎన్సీఆర్పీ కేసులు	491	833	373
ఎఫ్ఐఆర్	64	61	45
పోలీసులు అడ్డుకున్న సొమ్ము	రూ.39.30 లక్షలు	రూ.79.05 లక్షలు	రూ.39.42 లక్షలు
బాధితులకు తిరిగి చెల్లింపులు	రూ.5.55 లక్షలు	రూ.39.30 లక్షలు	రూ.30.40 లక్షలు

చేపపిల్లల పంపిణీపై సందిగ్ధత

- టెండర్లు దాఖలు చేసిన కాంట్రాక్టర్లు
- నేడు టెండర్లు ఓపెన్
- తొలిసారి మల్కపేట రిజర్వాయర్‌లోకి చేప పిల్లలు
- జిల్లాలో 1.48 కోట్ల చేపపిల్లల పంపిణీ లక్ష్యం
- అదును దాటుతోందని మత్స్యకారుల ఆందోళన



నిండుగా జలకళతో మిడ్‌మానేరు ప్రాజెక్టు

బోయినపల్లి(చొప్పదండి): మత్స్యకారులకు ఉపాధి అందించేందుకు ప్రభుత్వం ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో ఉచితంగా చేపపిల్లల పంపిణీని చేపట్టింది. ఈ సంవత్సరం చేపపిల్లల పంపిణీపై సందిగ్ధత నెలకొంది. ఇప్పటికే చేపపిల్లలను పంపిణీ చేయాల్సి ఉండగా ఇంకా టెండర్లు కూడా ఖరారు కాలేదు. గతేడాది సైతం ఆలస్యంగా అక్టోబర్ నెలాఖరులో పంపిణీ చేశారు. ఈ సారి కూడా అదే తంతు కొనసాగుతోంది. అదును దాటిన తర్వాత చెరువుల్లో చేపపిల్లలు వదిలితే అనుకున్న స్థాయిలో ఎదుగవని మత్స్యకారులు పేర్కొంటున్నారు.

ఈసారి కొత్తగా మల్కపేటలోకి..

బోయినపల్లి మండలంలోని మిడ్‌మానేరు, గంభీరావుపేట మండలంలోని ఎగువ మానేరు, ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ ప్రాజెక్టుల్లో ఏటా జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపపిల్లలు వదులుతున్నారు. అయితే ఈ సంవత్సరం కొత్తగా కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్‌లో చేపపిల్లలు పంపిణీ చేయనున్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా ఉన్న నీటి వనరుల్లో 1.48 కోట్ల చేపపిల్లలు వదలాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏజెన్సీలు ముందుకు రాకపోవడంతో టెండర్ల ప్రక్రియ ఆలస్యమైంది. ఇటీవల టెండర్లు దాఖలు చేయగా, వాటిని ఈనెల 15న తెరువనున్నారు.

మిడ్‌మానేరులో అత్యధికం

జిల్లాలోని నాలుగు ప్రాజెక్టులతోపాటు సుమారు 452 చెరువుల్లో 1.48కోట్ల మేర చేపపిల్లలు పంపిణీ చేయాలని ప్రభుత్వం టెండర్లు పిలిచింది. బొచ్చె, రవు, మోస్, బంగారు తీగలు చేపపిల్లల రకాలు ఉన్నాయి. మిడ్‌మానేరులో 28.50 లక్షలు, ఎగువ మానేరులో 10.50, అన్నపూర్ణలో 13.69, మల్కపేటలో 7.49 లక్షల చేపపిల్లలు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. 44 పెరీనియల్ ట్యాంకుల్లో 20 లక్షలు, 408 సీజనల్ ట్యాంకుల్లో 68.45 లక్షలు చేపపిల్లలు వదలనున్నారు. నాలుగు ప్రాజెక్టుల్లో 80–100 ఎంఎం నుంచి 79–69 ఎంఎం, చెరువుల్లో 35–40 ఎంఎం నుంచి 68–45 ఎంఎం సైజ్‌లో ఉన్న చేప పిల్లలు వదలనున్నారు.

జిల్లాలో మత్స్యశాఖ స్వరూపం

మత్స్యకార్మిక సంఘాలు : 168
మత్స్యకారులు : 9,526
ప్రధాన జలాశయాలు: మిడ్‌మానేరు, అప్పర్ మానేరు, అన్నపూర్ణ, మల్కపేట
చెరువులు, కుంటలు : 452

ఉపాధికి ఇబ్బంది అవుతోంది



చేపపిల్లలు విడుదల చేయకపోవడంతో ఉపాధికి ఇబ్బంది అవుతోంది. మిడ్‌మానేరులో చేప పిల్లలు వదిలితే కొదురుపాక, వెంకట్రావుపల్లి, కరీంనగర్ రోడ్డు పరిసరాల్లో చాలా మంది మత్స్యకారులు చేపల దుకాణాలతో జీవనోపాధి పొందుతున్నారు.

– మైలారం శ్రీనివాస్, మత్స్యకారుడు, కొదురుపాక

చేపపిల్లలు ఎదగవు



గతేడాది ఆలస్యం కావడంతో చేపపిల్లల సైజ్ పెరుగలేదు. అంతకుముందు ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లోనే పంపిణీ చేసేవారు. దీంతో చేపల సైజ్ బాగా వచ్చి లాభం వచ్చేది. ఆలస్యంగా పంపిణీ చేస్తే సరైన ఎదుగుదల ఉండదు.

– బొజ్జ శ్రీనివాస్, బోయినపల్లి

టెండర్ల ప్రక్రియ పూర్తి



జిల్లాలో ఈ ఏడాది నాలుగు ప్రాజెక్టులతోపాటు 452 చెరువుల్లో కలిపి 1.48 కోట్ల చేపపిల్లలు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇటీవల టెండర్ల ప్రక్రియ పూర్తయింది. టెండర్లు ఈనెల 15న ఓపెన్ చేస్తారు. అనంతరం మిగతా ప్రక్రియలు పూర్తి చేశాక చేపపిల్లల పంపిణీ చేస్తాం.

– సౌజన్య, జిల్లా మత్స్యశాఖ అధికారి

క్లుప్తంగా

కడుపునొప్పితో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య


హారిక (ఫైల్)

మల్యాల: కడుపునొప్పితో మండలంలోని రామన్నపేటకు చెందిన ఇంటర్ విద్యార్థిని హారిక (16) ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. వెల్గటూర్ మండలం గొడిశెలపేటకు చెందిన ఒడిగ గంగాధర్, వరలక్ష్మి దంపతులు 15 ఏళ్ల క్రితం రామన్నపేటకు వచ్చి ఇక్కడే ఉంటున్నారు. గంగాధర్ లారీ డ్రైవర్. తల్లి వ్యవసాయ కూలీ. వీరి రెండో కూతురు హారిక జగిత్యాలలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతుండగా ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటోంది. అయినప్పటికీ తగ్గకపోవడంతో ఆదివారం ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

రామడుగు(చొప్పదండి): మండలంలోని వెలిచాల గ్రామ పరిధి కిష్టారావుపల్లి గ్రామానికి చెందిన చాట్ల నర్సయ్య (65) చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. ఈ నెల 3న చాట్ల నర్సయ్యకు ఇదే గ్రామానికి చెందిన చాట్ల గంగారాం మధ్య గొడవ జరగడంతో పంచాయితీ నిర్వహించుకున్నారు. పంచాయితీ జరుగుతుండగా గంగారాం, నర్సయ్య మధ్య గొడవ జరిగింది. దీంతో గంగారాం కుమారుడు భాస్కర్ మా నాన్నను ఎందుకు తిడుతున్నావని నర్సయ్యపై ప్లాస్టిక్ కుర్చీతో దాడి చేయడంతో కిందపడిపోయాడు. వెంటనే అక్కడే ఉన్న సిమెంట్ రాయితో ముఖంపై కొట్టడంతో పాటు గంగారాం కూడా దాడి చేయడంతో నర్సయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. 6న బాధితుడిని కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం మరో ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడి కూతురు కళ్యాణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రాజెక్టుల ల్యాండ్‌మార్క్ మిడ్‌మానేరు


జలకళతో మిడ్‌మానేరు

బోయినపల్లి(చొప్పదండి): తెలంగాణ ప్రాజెక్టులకు ల్యాండ్‌మార్క్‌లా మధ్యమానేరు నిలుస్తోంది. ఎగువ మానేరు, దిగువ మానేరుకు మధ్యలో ఉన్న మిడ్‌మానేరు 5.8 లక్షల క్యూసెక్కుల వరద పోటును తట్టుకుంటుంది. రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద శ్రీరాజరాజేశ్వర(మధ్యమానేరు) ప్రాజెక్టును 27.5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. సుమారు రూ.750 కోట్ల అంచనాలతో నిర్మించారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాలో సుమారు 2లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2006లో దివంగత సీఎం వైఎస్సార్ ఈ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రాజెక్టు నిర్మాణంలో పాలుపంచుకున్న ఇంజినీర్లందరూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా వారే. ప్రాజెక్టు మొత్తం 32 సీసీ కెమెరాల నిఘాలో ఉంటుంది. 25 రేడియల్ గేట్లు, పవర్ ప్యాక్స్, లోకల్ కంట్రోల్ ప్యానల్, రిమోట్ కంట్రోల్ ప్యానల్స్ వంటి కొత్త పద్ధతులు ఉన్నాయి. ప్రాజెక్టులో 4 రివర్స్ స్లూయిస్‌లు ఏర్పాటు చేశారు. ప్రాజెక్టులో చేరిన సిల్ట్ రివర్స్ స్లూయిస్‌ల ద్వారా బయటకు వెళ్తుంది. ప్రాజెక్టు నిర్మాణంలో సిమెంట్, కాంక్రిట్, మట్టి, రౌతు, స్టీల్, వాడారు. ప్రాజెక్టు అడుగు భాగానికి వెళ్లడానికి గ్యాలరీని ఏర్పాటు చేశారు. దీనిలోకి వెళ్లడానికి మెట్లు, అధునాతన లిఫ్ట్ ఏర్పాటు చేశారు. ప్రాజెక్టులోకి వచ్చే నీరు నిల్వ చేయడం వల్ల ఎయిర్ వెళ్లడానికి గ్యాలరీలో పరికరాలు అమర్చారు. 500 మీటర్ల మేర స్పిల్‌వే, 10 కిలోమీటర్ల మేర కట్టను నిర్మించారు.



పవర్‌ప్యాక్ గది

చరిత్రకు సాక్ష్యం ఎలగందుల ఖిలా


ఎలగందుల ఖిలా

కొత్తపల్లి(కరీంనగర్): చరిత్రకు సాక్ష్యంగా కొత్తపల్లి మండలంలోని ఎలగందుల ఖిలా నిలుస్తోంది. కాకతీయులు, కులీకుతుబ్‌షాహీల శిల్ప కళావైభవానికి ప్రతీకగా ఖిలాలోని కట్టడాలు నిలుస్తున్నాయి. ఈ కోటలో టర్కీ, ఫ్రెంచ్ ఇంజినీర్ల ప్రభావం కనిపిస్తోంది. ఫ్రెంచి, టర్కీ ఇంజినీర్ల ప్రభావంతో ఈ కోట అనేక విషయాల్లో మధ్యయుగపు ఐరోపా శైలిని పోలి ఉంది. 200 అడుగుల ఎత్తు, 2.5 మైళ్ల విస్తీర్ణంలో మానేరునదిని ఆనుకొని ఉంది. ఎలగందుల కోటను కాకతీయులు 1083- 1323 మధ్య నిర్మించారు. ఈ కోటకు మొదటి పేరు 'వెలిగుందుల'. దీనిని మునునూరి నాయకులు, రాచర్ల పద్మనాయకులు ధృఢంగా తయారు చేశారు. కోట చుట్టూ సుమారు 5 కిలోమీటర్ల వెడల్పు, 4 మీటర్ల లోతు నీటి కందకాన్ని తవ్వించి మొసళ్లతో నింపి శత్రువుల నుంచి రక్షణగా ఏర్పాటు చేశారు. 16వ శతాబ్దంలో ఈ కోటను కుతుబ్‌షాహీలు ఆక్రమించారు. తర్వాత మొఘల్ సామ్రాజ్యాధీనంలోకి వచ్చింది. హైదరాబాద్ నిజాం పాలనలో నిజాం ఉల్ ముల్క్ అసఫ్‌జాహి (1724-1748) కాలంలో అమీన్‌ఖాన్ ఈ కోట ఖిలేదార్‌గా బాధ్యతలు చేపట్టారు. 1754లో నవాబ్ సలాబత్ జంగ్ కాలంలో మీర్జా ఇబ్రహీం దంసా ఈ కోటను పునర్‌నిర్మించారు. 1905లో ఆరో నిజాం మహబూబ్ అలీఖాన్ జిల్లా కేంద్రాన్ని ఎలగందుల్ నుంచి కరీంనగర్‌కు మార్చారు. కోటలో నీలకంఠస్వామి, లక్ష్మీనరసింహస్వామి ఆలయాలతోపాటు మసీదు హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్నాయి.

చెక్కుచెదరని కట్టడాలు

- ఇంజినీరింగ్ ప్రతిభకు నిలువెత్తు సాక్ష్యాలు
- సాగు, తాగునీరు అందిస్తున్న ప్రాజెక్టులు
- ఉమ్మడి జిల్లాలో ఆకట్టుకుంటున్న నిర్మాణాలు

ఇంజినీర్ల ప్రతిభకు నిలువెత్తు సాక్ష్యాలుగా ప్రాజెక్టులు నిలుస్తున్నాయి. వందల ఏళ్లుగా చెక్కు చెదరకుండా లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకొని సేవలందిస్తున్నాయి. నిజాం కాలంలో నిర్మించిన ఎగువమానేరు, ఐదు మత్తళ్ల సింగసముద్రం, అనంతారం ప్రాజెక్టు, మిడ్‌మానేరు, ఎలగందుల ఖిలా.. చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. నేడు ఇంజినీర్ల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పాతకాలం నాటి నిర్మాణాలపై ప్రత్యేక కథనం.


నిజాం కాలంలో నిర్మించిన గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు



కాకతీయుల కాలంలో నిర్మించిన గంభీరావుపేట మండలం సింగసముద్రం చెరువు

గంభీరావుపేట(సిరిసిల్ల): ఇంజినీర్ల కృషి, ప్రతిభకు నిలువెత్తు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి గంభీరావుపేట మండలంలోని నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు, సముద్రలింగాపూర్‌లోని ఐదు మత్తడుల సింగసముద్రం చెరువు. నిజాం కాలంలో నిర్మించిన కట్టడాలు ఇప్పటికీ చెక్కుచెదరకుండా సాగు, తాగునీటిని అందిస్తున్నాయి.

స్వాతంత్ర్యానికి పూర్వమే..

నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు పనులు స్వాతంత్ర్యానికి పూర్వం 1945లో ప్రారంభమైంది. 1948-50 మధ్యకాలంలో పూర్తయింది. నిజాం కాలంలో 18 మంది ఇంజినీర్లు ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వాములయ్యారు. ప్రస్తుతం ఏళ్లు గడువక ముందే ప్రాజెక్టులు నేలకూలుతుంటే.. వందల ఏళ్లనాడు నిర్మించిన ఈ ప్రాజెక్టు ఆనాటి ఇంజినీర్ల ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తుంది. మట్టి, రాయి, మిశ్రమంతో, పరిమిత సాంకేతిక వనరులతో నిర్మించారు.

గంభీరావుపేట మండలం సింగసముద్రం చెరువు వంటి పురాతన నిర్మాణం ఇప్పటికీ సాక్ష్యంగా నిలుస్తోంది. కాకతీయుల కాలంలో నిర్మించిన సింగసముద్రం ఇప్పటికీ చుట్టుపక్కల గ్రామాలకు సేద్యం నీటిని అందిస్తోంది. కాలక్రమంలో ఆధునిక ఇంజినీర్లు దానిని ఐదు మత్తడుల చెరువుగా మార్చి వన్నె తెచ్చారు. ఆ యుగం ఇంజినీర్ల ప్రతిభను మన కళ్ల ముందు నిలబెట్టారు.


సైఫన్‌లోకి వెళ్తున్న ఎస్సారెస్పీ నీరు

అద్భుత కట్టడం.. నాగులపేట సైఫన్

- ఆసియాలోనే అరుదైన కట్టడంగా గుర్తింపు

కోరుట్ల రూరల్: ఇంజినీరింగ్ పనితీరుకు అద్భుత కట్టడంగా నిలుస్తుంది కోరుట్ల మండలం నాగులపేట వద్దగల సైఫన్. ఇది ఆసియాలో అరుదైన కట్టడాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అప్పటి సూపరింటెండెంట్ ఇంజినీర్ పీఎస్.రామకృష్ణారాజు సైఫన్ నిర్మాణానికి డిజైనింగ్ చేశారు. నాగులపేట వద్ద కాకతీయ కాలువ సుమారు 100 మీటర్ల వెడల్పుతో ప్రవహించే పెద్ద వాగు దాటాల్సి ఉంటుంది. వాగుకు అడ్డంగా కాలువ నిర్మించడం కష్టం కావటంతో వాగుపై నుంచే 100 మీటర్ల సొరంగమార్గం తవ్వి.. ఎప్పటిలాగే వాగు ప్రవహించేలా డిజైన్ చేశారు. 100 మీటర్ల పొడవు.. సుమారు 30 ఫీట్ల లోతు.. 25 ఫీట్ల వెడల్పుతో సైఫన్ నిర్మాణం చేపట్టారు. సైఫన్ సొరంగమార్గం ద్వారా కాలువ నీరు.. వాగులో వరద ప్రవాహం.. ఈ అద్భుత కట్టడం ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది.


సైఫన్ పై భాగం నుంచి ప్రవహిస్తున్న పెద్ద వాగు


ఇంజినీర్ రామకృష్ణరాజు విగ్రహం

అనంతారం అద్భుతం


అనంతారం ప్రాజెక్టు

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండలం అనంతారం ప్రాజెక్టు 500 ఏళ్ల క్రితం నిర్మించారు. ప్రాజెక్టు ఆయకట్టు దాదాపు 800 ఎకరాల వరకు ఉంటుంది. అనంతారం ప్రాజెక్టు నీటితో నిండితే బిక్కవాగు పరివాహక ప్రాంతమైన అనంతారం, రహీంఖాన్‌పేట, ఇల్లంతకుంట, వంతడుపుల, నర్సక్కపేట గ్రామాల్లోని పంటలకు సమృద్ధిగా సాగునీరు లభిస్తుంది.

డాక్ బంగ్లా

ప్రాజెక్టు పరిధిలోని డాక్ బంగ్లాను రెండెకరాల విస్తీర్ణంలో నిర్మించారు. ప్రాజెక్టును పరిశీలించడానికి వచ్చిన ఇరిగేషన్ అధికారులు ఇక్కడే సేద తీరేవారు. డాక్‌బంగ్లా ఇల్లంతకుంట మండలంలో ప్రాముఖ్యత సంతరించుకుని ఉంది.


డాక్ బంగ్లా

బ్యాంక్ లోన్ ఇప్పిస్తానని మోసం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌కు చెందిన ఒక వ్యక్తికి ముద్రలోన్ ఆఫీసర్ అని ఫోన్ చేసి రూ.5 లక్షల లోన్ ఇప్పిస్తానని నమ్మబలికాడు. ప్రాసెసింగ్ ఫీజుగా పలు దఫాలుగా రూ.1.25లక్షలు కాజేశాడు. అయినా లోన్ మంజూరుకాకపోవడంతో బాధితుడు ఆదివారం పోలీసులను ఆశ్రయించాడు. ఎస్సై కె.రాహుల్‌రెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలని సూచించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


సుప్రియ (ఫైల్)

పెగడపల్లి: మండలంలోని ఎల్లాపూర్‌కు చెందిన మల్లారపు సుప్రియ(27) చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందింది. ఎస్సై కిరణ్‌కుమార్ కథనం ప్రకారం.. సుప్రియ కొంతకాలంగా థైరాయిడ్ వ్యాధితో బాధపడుతోంది. ఇటీవలే కామెర్ల వ్యాధిబారిన పడింది. ఆసుపత్రుల్లో చూపించుకున్నా ఆరోగ్యం కుదటపడలేదు. జీవితంపై విరక్తి చెంది ఈనెల 12న బ్లాక్‌రోజ్ పౌడర్ తాగింది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. సుప్రియ తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పట్టపగలు వివాహిత దారుణ హత్య

- కుటుంబ కలహాలే కారణం
- భార్యను చంపిన భర్త


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ రమేశ్

రామగిరి(మంథని): పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని వకీల్‌పల్లి ప్లాట్స్‌లో ఆదివారం పూసల రమాదేవి(35) దారుణ హత్యకు గురైంది. స్థానికుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా రెడ్డికాలనీకి చెందిన రమాదేవిని .. పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని వకీల్‌పల్లి ప్లాట్స్‌కాలనీలో నివాసం ఉండే పూసల కృపాకర్ సుమారు 13 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకన్నారు. వీరికి ఒక కుమారుడు జాన్సన్, కుమార్తెలు జోషిత(9), జ్యోత్స్న ఉన్నారు. ఏడాదిగా వీరి మధ్య కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. అప్పటినుంచి భార్యాభర్తలు వేర్వేరుగా ఉంటున్నారు. రమాదేవి ఆదివారం కృపాకర్ ఇంటికి చేరుకుంది. ఈక్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆగ్రహంతో కత్తితో రమాదేవిపై కృపాకర్ దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారంతో ఎస్సై శ్రీనివాస్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వివరాలు సేకరించారు. గోదావరిఖని ఏసీపీ రమేశ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్య అనంతరం కృపాకర్, అతడి తల్లిదండ్రులు పరారయ్యారు. అయితే, తల్లిదండ్రులు మంథని పోలీసుస్టేషన్‌లో ఉన్నట్లు సమాచారం. పోలీసులు కృపాకర్ కోసం ఆరా తీస్తున్నారు. కుటుంబ కలహాలే హత్యకు కారణమని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని ఎస్సై వివరించారు.

పంచాయితీయే ప్రాణం తీసిందా?

ఏడాదిగా వేర్వేరుగా ఉంటున్న రమాదేవి ఆదివారం అత్తగారింటికి వచ్చి ప్రాణాలు కోల్పోవడం కలకలం రేపింది. సెంటినరికాలనీకి చెందిన ఒకమతపెద్ద ద్వారా కృపాకర్ రాయబరం చేయడంతో రమాదేవిని అక్కడకు వచ్చిందని, మతపెద్ద సమక్షంలో పంచాయితీ జరిగిందని తెలిసింది. ఆ తర్వాత రమాదేవి వకీల్‌పల్లి ప్లాట్స్‌కాలనీకి చేరుగా.. భార్యాభర్తల మధ్య గొడవ జరిగిందని, ఈక్రమంలోన అత్తగారింటి ఎదుట రోడ్డుపై విగతజీవిగా పడిపోయిందని స్థానికులు కంటతడి పెట్టారు. క్షణికావేశంలో భార్యను చంపడంతో ముగ్గురు పిల్లలు రోడ్డున పడ్డారని ఆవేదన చెందారు. కుటుంబ కలహాలు పచ్చనికాపురంలో చిచ్చుపెట్టడంతో పిల్లలు దిక్కులేనివారయ్యారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- ఫేస్‌బుక్‌లో పోస్టుపై పోలీసులు కొట్టారని మనస్తాపం
- సెల్ఫీ వీడియోతో ఎలుకల మందు తాగిన వైనం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: తమ ఊరికి బస్సు కావాలంటూ ఓ యువకుడు పెట్టిన పోస్టు అతని ఆత్మహత్యాయత్నానికి దారి తీసింది. అకారణంగా తనను పోలీసులు చావబాదారని మనస్తాపం చెందిన ఆ యువకుడు.. సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఎలుకల మందు తాగాడు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం హిమ్మత్‌నగర్‌కు చెందిన బండారి శ్రీనివాస్ అనే యువకుడు తమ ఊరికి బస్సు సౌకర్యం కల్పించాలని ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టాడు. దీనిపై నాచుపల్లి శ్రీనివాస్ అనే మరో వ్యక్తి ఫోన్ చేసి దూషించాడు. శనివారం ఉదయం మల్యాల పోలీసులు శ్రీనివాస్‌ను అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. అక్కడ ఎస్సై నరేశ్ తనను దుర్భాషలాడుతూ రోజంతా చితకబాదారని, అందుకే తాను మనస్తాపంతో ఎలుకల మందు తాగుతున్నానను అంటూ శ్రీనివాస్ వీడియోలో పేర్కొన్నాడు. తన చావుకు ఎస్సై నరేశ్, మరో కాంగ్రెస్ నేత కారణమని స్పష్టం చేశాడు. గతంలో తాను ఇదే విషయమై ఎన్ని పోస్టులు పెట్టినా ఏనాడూ ఇలాంటి పరిస్థితి ఎదురవలేదని, పైగా తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారని వాపోయాడు. ఎలుకల మందు తాగిన అతను ప్రస్తుతం ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. శ్రీనివాస్ ఆత్మహత్యాయత్నం వీడియో ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. ఆదివారం వన్‌టౌన్ సమీపంలోని ఓ హోటల్‌లో ఈ ఘటన జరిగినట్లు సమాచారం.

రాయికల్ శివాలయంలో చోరీ

- పోలీసుల అదుపులో నిందితుడు?


హుండీ పగలగొట్టిన దొంగలు

రాయికల్: రాయికల్ పట్టణంలోని శివాలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఆలయంలోని హుండిని పగలగొట్టి నగదును దొంగలించారు. దొంగ ముందస్తుగా సీసీ కెమెరాలు పగలగొట్టి దొంగతనానికి ప్రయత్నించాడు. దానికి ముందు రికార్డయిన వీడియో ఆధారంగా ఆదివారం సదరు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

పోలీసుల అదుపులో యువకుడు

ఇల్లంతకుంట(మానకొండూర్):ఓ మైనర్ బాలిక నగ్న వీడియోలు చిత్రీకరించి, ఇతరులకు పంపించిన యువకుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. బాలిక నగ్న వీడియోలు తీసిన యువకుడు గతంలో గంజాయి కేసులో నిందితుడు అని ప్రచారంలో ఉంది. ఈ వీడియోలు ప్రస్తుతం వెలుగుచూడడంతో బాధిత బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. సదరు యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఇటీవల మండలానికి చెందిన ఓ మైనర్ బాలిక ఆత్మహత్య ఉదంతం మరిచిపోకముందే మరో మైనర్ నగ్న వీడియోలు చిత్రీకరించినట్లు వెలుగులోకి రావడం మండలంలో చర్చకు దారితీసింది.

పిడుగుపాటుకు కాలిపోయిన ట్రాక్టర్


కాలిపోయిన ట్రాక్టర్ స్టీరింగ్

సుల్తానాబాద్‌రూరల్: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కొదురుపాక గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున భారీవర్షం కురిసింది. ఈక్రమంలో పిడుగుపడి ట్రాక్టర్ స్టీరింగ్ కాలిపోయింది. గ్రామంలోని చెట్టుపై పిడుగుపడగా దానికిందనే పార్క్‌చేసిఉన్న గ్రామపంచాయతీకి చెందిన ట్రాక్టర్ కాలిపోయింది.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు స్పందన


పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు విశేష స్పందన వచ్చింది. జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల నుంచి సుమారు 150 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. అంతకుముందు తెలంగాణ కబడ్డీ సంఘం ఉపాధ్యక్షుడు సీహెచ్.సంపత్‌రావు పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీల్లో రాణించిన క్రీడాకారులను ఈ నెల 25 నుంచి నిజామాబాద్ జిల్లా ముప్కల్ మండలంలో జరిగే రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కబడ్డీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బుర్ర ఎల్లయ్యగౌడ్, సీహెచ్.మల్లేశ్, ప్రధాన కార్యదర్శి బుర్ర మల్లేశ్‌గౌడ్, పెటా కార్యదర్శి ఆడెపు శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారులు మాధవరెడ్డి, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

కనుపాపను కాపాడండి

- వెన్నుపూస సమస్యతో బాధపడుతున్న విద్యార్థిని
- బడిలో ఉండాల్సిన చిన్నారి ఆస్పత్రిలో..
- నిమ్స్‌లో చికిత్స పొందుతున్న సాత్విక
- శస్త్రచికిత్సకు రూ.4లక్షలు అవసరం
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు


నిమ్స్‌లో చికిత్స పొందుతున్న చిన్నారి సాత్విక, పక్కనే వేదనగా తల్లి భాగ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఇంట్లో చలాకిగా తిరగాల్సిన చిన్నారి ఆస్పత్రి బెడ్‌పై కదలలేని స్థితిలో ఉంది. ఆడపిల్ల పుట్టగానే సంతోషించిన తల్లిదండ్రులకు ఆమెకు వచ్చిన అనారోగ్య సమస్యతో వేదన మొదలైంది. చక్కగా బడికి వెళ్లే చిన్నారి వెన్నుముక సమస్యతో కాళ్లు చేతులు పడిపోవడంతో మంచానికే పరిమితమైంది. ఆపరేషన్ చేస్తే నడుస్తుందన్న వైద్యుల సూచనలతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు రూ.4లక్షలు అవసరం ఉంటాయని వైద్యులు తెలపడంతో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌కు చెందిన మిడిదొడ్డి భాగ్య-మల్లేశం దంపతులకు ఐదో తరగతి చదువుతున్న కూతురు సాత్విక ఉంది. నిత్యం చలాకీగా బడికి వెళ్లే చిన్నారి హఠాత్తుగా అనారోగ్యానికి గురైంది. నడవలేని స్థితిలో మంచానికే పరిమితం కావడంతో వైద్యులను సంప్రదించారు. పరీక్షలు చేసిన వైద్యులు వెన్నుపూసలో సమస్య ఉన్నట్లు గుర్తించారు. ఆపరేషన్‌కు రూ.4లక్షలు ఖర్చు అవుతుందని తెలపడంతో చేతిలో చిల్లిగవ్వలేని వారు ఆ డబ్బులు ఎలా సమకూర్చాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఈక్రమంలోనే కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలవగా.. స్పందించిన కలెక్టర్ రూ.74,938 చెక్కును అందించారు. దీంతో వారు చిన్నారిని నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. శస్త్రచికిత్సకు ఈ మొత్తం సరిపోకపోవడంతో దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్నారు. సాయం చేయాల్సిన దాతలు మిడిదొడ్డి భాగ్యకు 96181 51488లో సాయం చేయాలని వేడుకుంటున్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

- నాడు ప్రమాదంలో అన్న.. నేడు తమ్ముడు
- ఇద్దరు కొడుకుల మృతితో రోడ్డున పడ్డ దంపతులు


మృతుడు ఖలీల్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన 21 ఏళ్ల యువకుడు ఆదివారం గుండెపోటుతో మరణించాడు. మహమ్మద్ హమీద్- మలాన్ దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు మహమ్మద్ ఖలీల్(21) స్థానికంగా ఓ దుకాణంలో గుమస్తాగా పనిచేసేవాడు. మలాన్ తన భార్యకు కంటి ఆస్పత్రిలో చూపించేందుకు శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లాడు. ఖలీల్ రోజుమాదిరిగానే తాను పనిచేసే దుకాణానికి వెళ్లాడు. రాత్రి ఇంటికొచ్చిన ఖలీల్ భోజనం చేసి నిద్రపోయాడు. ఉదయం లేవకపోవడంతో అతని అమ్మమ్మ చుట్టుపక్కల వారిని పిలువగా.. స్థానిక ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా ఖలీల్ సోదరుడు సలీం నాలుగేళ్ల క్రితం హైదరాబాద్‌లోని ఏసీ వర్క్‌షాపులో పనిచేస్తుండగా కంప్రెషర్ పేలి మృతిచెందాడు. ఇద్దరు కుమారుల మృతితో ఆ దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బీరుసీసాలతో యువకుల దాడులు


గాయపడిన అనిల్

సుల్తానాబాద్‌రూరల్: మద్యం మత్తులో యువకులు బీరుసీసాలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని ఓ వైన్స్ వద్ద చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. సుల్తానాబాద్‌లోని మార్కెండేయకాలనీకి చెందిన యువకులు అనిల్, బోస్ ఓ వైన్స్ వద్ద మద్యం తాగారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆగ్రహంతో ఇద్దరూ బీరుసీసాలతో దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరికీ గాయాలు కాగా స్థానికులు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు వైద్యచికిత్స అందిస్తున్నారు.